క్లుప్తంగా

కంప్యూటర్ విరాళం


దాత లక్ష్మణాచారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు పూర్వ విద్యార్థి లక్ష్మణాచారి రూ.22 వేల విలువైన కంప్యూటర్‌ను విరాళంగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానుయల్ తెలిపారు. లక్ష్మణాచారిని ఉపాధ్యాయులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేద్దాం

కోసిగి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరగనున్న పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓ–2 శోభారాణి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు.

డివైడర్ పనుల పరిశీలన


ట్యాంక్‌బండ్ రోడ్డులో డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో నిర్మిస్తున్న రోడ్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అంతకుముందు పట్టణంలోని కొండవీటి ప్రాంతం, షరాఫ్ బజార్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ శరత్‌చంద్ర తదితరులు ఉన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బారిక మల్లికార్జున జాతీయస్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఇందిరాదేవి, ఫిజికల్ డైరెక్టర్ జి.రామన్న తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థి మల్లికార్జునను అభినందించారు. వారు మాట్లాడుతూ.. గత నెలలో బాపట్ల జిల్లాలో అండర్–14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మల్లికార్జున కర్నూలు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో త్వరలో మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

కందనాతి మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ఆలయంలో ప్రతిష్టించిన మారెమ్మదేవి

కోసిగి: మండల కేంద్రంలోని కడపాళెం వీధి బసవన్న కట్ట వద్ద కొత్తగా నిర్మించిన ఆలయంలో కందనాతి మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయంలో వేదపండితుడు మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ఠ, గోపూజ, మహాగణపతి పూజ, దీక్ష హోమం, చండి హోమం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, యంత్ర స్థాపన, అలంకరణ, పూర్ణాహుతి, కుంభాభిషేకం, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పూజల్లో ఎంపీపీ ఈరన్న, బుల్లి నరసింహులు, భక్తులు నిమ్మయ్యస్వామి,గోవిందు పాల్గొన్నారు.

వైద్యాధికారులు నిర్లక్ష్యం వీడాలి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని ఇందిరా నగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారులు మధ్యాహ్నం 12 గంటలైనా ఆస్పత్రికి రాకపోవడంతో ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ నాయకులు అన్నారు. వారు శుక్రవారం వారు అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చికిత్స కోసం రోగులు గంటల తరబడి వేచి ఉండడం ఆందోళనకరమైన విషయమన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం చేసే వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను కోరారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: మహిళా టీచర్ మృతికి కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, జిల్లా సమితి సభ్యుడు లింగప్ప డిమాండ్ చేశారు. వారు శుక్రవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భారతి, ఉపాధ్యాయుడు నబీసాబ్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందన్నారు. నిందితుడు ఆమెను మానసికంగా వేధించినట్లు కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని చెప్పారు. అధికారులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.


ఎమ్మిగనూరు: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి


ఎమ్మిగనూరు: నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు


పెద్దకడబూరు: జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..


కోసిగి: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆదోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళి


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, అధికారులు

ఆదోని టౌన్: భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, చలపతి, ఇంతియాజ్, నాయకులు ఈరన్న, గంగాధర్, నల్లారెడ్డి, వేణు, శ్రీనివాసులు, రామకృష్ణ, ఎరుకుల రమేష్, హనుమంతు, భాస్కర్, లక్ష్మన్న, ప్రహ్లాద్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.సాయిబాబా, డివిజన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పి.షేక్షావలి, తాలూకా ఉపాధ్యక్షుడు కత్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండలంలోని విరుపాపురం గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ రూపకల్పనలో, సమసమాజ నిర్మాణంలో అంబేడ్కర్ కృషిని కొనియాడారు. తహసీల్దార్ శివరాముడు, జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండిగిరి మున్సిపల్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు రామదాసు, బొన్నూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ఏబీవీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ జిల్లా కన్వీనర్ వీరేష్, నాయకులు వెంకటరమణ, ఉమామహేశ్, గోవింద్ రాజ్ పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

ఎమ్మిగనూరు టౌన్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ నిర్మాత వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా, దళిత సంఘాల నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. అంబేడ్కర్ సర్కిల్‌లోని విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, భాస్కర్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్ అహ్మద్, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్సూర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, కౌన్సిలర్లు సుధాకర్, శివప్రసాద్, డిష్ కేశవరెడ్డి, కోటకొండ నరసింహులు పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డంనారాయణరెడ్డి, ముగతి విరూపాక్షిరెడ్డి, బందెనవాజ్, చిక్కం జానయ్య నివాళులు అర్పించారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల జెడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రాఘవేంద్ర, జగదీష్, అన్నపూర్ణ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

కోసిగి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకుందామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుర్గప్ప, నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సామేల్, హనుమంతు, అంజి, నరసింహులు, రాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యువరాజ్, జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల ప్రధానకార్యదర్శి దుబ్బన్న ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.

కౌతాళం: మండలంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో కామవరం సర్పంచ్ వసంత, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, దళిత సమాఖ్య మండల కమిటీ నాయకులు విజయమోహన్‌కుమార్, మరళి ముఖేష్, కార్తికి ప్రకాశ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఆదోని రూరల్: కౌతాళం మండలంలోని కుంబళూరు గ్రామంలో ఎస్సీలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంబళూరు గ్రామంలో మల కిష్టయ్య, ఈరన్న, లలిత, తాయమ్మ కుటుంబసభ్యులపై అదే గ్రామానికి చెందిన బసన్నగౌడ్ కుమారులు ముదేగౌడ, మాదేవప్ప, పక్కీరప్ప, ఈరన్నగౌడ్, భీరప్ప, అప్పన్నగౌడ్, నర్సారెడ్డి, కర్రెప్ప, దిన్నెవీరేష్ కలిసి దాడి చేశారన్నారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకుని వీరు ఎక్కడికి వెళ్లినా అంతు చూస్తామని బెదిరిస్తూ దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దాడులు చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆ సంఘం ఆదోని మండలాధ్యక్షులు ఎం.నరేష్‌కుమార్, చంద్రశేఖర్, రాజోలప్ప, మరకట్టు కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదోని టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివశంకర్, శివకుమార్, శివరాం, వీరప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము గత 25–30 సంవత్సరాల నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నామన్నారు. వాటర్ లైన్‌మెన్, ఫిట్టర్స్, లీకేజ్ మెకానిక్స్, పంప్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, వీధి దీపాలు, పార్కు, కంప్యూటర్ ఆపరేటర్స్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్, బోర్‌వెల్ మెకానిక్స్, వాచ్‌మెన్స్‌గా పని చేస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి తాము పనిచేస్తున్నా తమకు కనీస వేతనం అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని స్పష్టం చేశారు.

వ్యవసాయ కూలీల సుగ్గిబాట


వాహనంలో వలస వెళుతున్న ఆరేకల్ గ్రామస్తులు

ఆదోని రూరల్: ఆదోని మండలంలో రోజురోజుకు వలసలు పెరిగిపోతున్నాయి. దీంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వ్యవసాయ కూలీలకు గ్రామాల్లో పని లేకపోవడం, అధికారులు ఉపాధి పనులు కల్పించకపోవడంతో గ్రామాల ప్రజలు నిత్యం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. గత ప్రభుత్వం స్థానికంగానే ఉపాధి పనులు కల్పించి వలసల నివారణకు చర్యలు తీసుకునేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజకీయాలకు తావివ్వడంతో ఉపాధి పనులు నిలిచిపోయాయి. దీంతో పనులు దొరక్క కూలీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని ఆరేకల్ గ్రామం నుంచి శుక్రవారం దాదాపు 120 కుటుంబాల వారు రెండు ట్రక్కుల్లో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలసబాట పట్టారు. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పొట్టకూటి కోసం వలస వెళ్తున్నామని కూలీలు పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి పనులు ఉంటే తాము వలస వెళ్లాల్సిన దుస్థితి ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రసన్న ఆంజినేయులు శుక్రవారం తెలిపారు. సోమప్ప సర్కిల్, వైఎస్సార్ సర్కిల్, జీఎం పెట్రోల్ బంక్ ప్రాంతం, శిల్పా ఎస్టేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కాగడాలతో నిరసన

ఆదోని అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మరణకాండకు వ్యతిరేకంగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కాగడాలతో ర్యాలీ నిర్వహించి విశ్వహిందూ పరిషత్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ‘మేలుకో హిందూ... మేలుకో హిందూ’ అనే నినాదాలతో విశ్వహిందూ పరిషత్ కార్యాలయం నుంచి కాగడాలతో ర్యాలీగా బయలుదేరి కోట్ల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లాధ్యక్షులు బసవన్నగౌడ్, నాయకులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మరణకాండ దారుణమన్నారు. హిందువులు మేల్కొకపోతే ఇబ్బందులకు గురవుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజుగౌడ్, జయరామ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో రైతు నడవలయ్యపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని హైకోర్ట్ సీనియర్ న్యాయవాది, బీజేపీ నాయకుడు పురుషోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని శుక్రవారం ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం డీఎస్పీ ఉపేంద్రబాబును ఆయన కార్యాలయంలో కలిసి నిందితులను కఠినంగా శిక్షించి బాధితుడుకి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత రైతు నడవలయ్య తన పొలం పక్క పొలానికి చెందిన శ్రీనివాసులు, అంజినయ్య వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నించగా కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకుని సాగు చేసుకుంటుండగా దాడి చేయడం శోచనీయమన్నారు.

ఆర్గానిక్ ప్యాడ్స్ వాడకం మేలు

ఆదోని సెంట్రల్: ఆర్గానిక్ ప్యాడ్స్ వల్ల ఆరోగ్యానికి మేలని సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం ఫెయిత్ హోంలో రేచెల్ విక్లిఫ్ ఫ్రెటర్నల్ సొసైటీ, రోహిత్ వెల్నెస్ ఫ్యామిలీ ఆర్గానిక్ ప్యాడ్స్‌ను ప్రారంభించారు. ఫెయిత్ హోం నిర్వాహకులు డాక్టర్ డానియేల్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ ఆదోనికి రావడం మంచి శుభపరిణామని తెలిపారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ సింథటిక్ ప్యాడ్స్ వాడడం వలన కౌమార దశలోనే బాలికలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. రసాయనాలు లేని ఆర్గానిక్ ప్యాడ్స్ ఉపయోగాలను వివరించారు. న్యాయవాది లలిత, అల్ఫ్రెడ్ రాజు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి


మండిగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమంలో రైతులు భూముల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండలంలోని విరుపాపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని మాట్లాడారు. రైతులు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకొస్తే నెల రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, మండల నోడల్ అధికారి నాగరాజు, తహసీల్దార్ శివరాముడు, జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆదోని రూరల్: గృహ నిర్మాణాల్లో నాణ్యత లోపించకుండా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మండిగిరి పంచాయతీలోని హౌసింగ్ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఉప తహసీల్దార్ గుండాలనాయక్, సంబంధిత అధికారులు ఉన్నారు.

భూసమస్యలపై అర్జీల స్వీకరణ


ఎమ్మిగనూరు: గుడేకల్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి


కోసిగి: అర్జీలను స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎమ్మిగనూరురూరల్: భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ చిరంజీవి, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్ శేషఫణి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ బంగారమ్మ, సర్పంచ్ మాల నరసమ్మ పాల్గొన్నారు.

- **గోనెగండ్ల:** మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలో తహసీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై 11 మంది అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మీ, ఏఓ హేమలత పాల్గొన్నారు.
- **కోసిగి:** గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని నోడల్ ఆఫీసర్ హిమ ప్రభాకర్ రాజు, టీడీపీ నేత రాఘవేంద్ర రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కందుకూరు, కామన్‌దొడ్డి గ్రామంలో తహసీల్దార్ నిత్యానంద రాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.
- **పెద్దకడబూరు:** మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో నోడల్ అధికారి విజయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో 18 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేశారు. తహసీల్దార్ శ్రీనాథ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ తేజస్విని పాల్గొన్నారు.
- **నందవరం:** మండల పరిధిలోని సదికై రవాడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, కర్నూలు డీఎల్‌డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసు మాట్లాడుతూ.. భూ విస్తీర్ణం, పాస్‌బుక్, ఎల్‌పీ నంబర్లు, ఒకే సర్వే నంబర్లతో తేడాలు ఉన్న వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామంలో 36 అర్జీల స్వీకరించామన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి


రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్

నందవరం: పేదలకు అందించే రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని నందవరం మండల ప్రత్యేక అధికారి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం సదిక్కైరవాడిలో రేషన్ పంపిణీ, స్టాక్‌ను స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని సూచించారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులను సకాలంలో కార్డుదారులకు సరఫరా చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బియ్యం, బ్యాలు, చక్కెర, జొన్నలు వంటి నిత్యావసర సరుకులు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆర్‌ఐ జెర్మియా, డీటీ మహేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలి మృతిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరాములు శుక్రవారం తెలిపారు. స్థానిక షరాఫ్‌బజార్‌లో నివాసముంటున్న శివప్రకాష్ భార్య భారతి (45) గురువారం ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు గురిచేయడం, అనారోగ్య కారణాలతో భారతి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ఆమె తండ్రి అనుమానం వ్యక్తం చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు


పూలవ్యాపారికి జరిమానా విధిస్తున్న సచివాలయ ఉద్యోగి

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే భారీ జరిమానాలు విధిస్తామని వార్డు సచివాలయ సిబ్బంది రామాంజినేయులు, ఆదిశేఖర్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది శుక్రవారం పట్టణంలోని గోనెగండ్ల రోడ్డులో గురుమూర్తి పూల దుకాణంతో పాటు వెంకటేశ్వర కిరాణ దుకాణంపై దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుని ఆయా దుకాణ యజమానులకు రూ.10వేల జరిమానా విధించారు. వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని కోరారు.

మిరప రైతులను ఆదుకోండి


మిరప పంటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కౌతాళం: నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు వెంటనే రైతుల అకౌంట్లకు జమ చేయాలన్నారు. శుక్రవారం పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, తాలుక అధ్యక్షుడు గోపాల్, సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ.. రైతులు ఎకరాకు రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టి మిరప పంట సాగు చేసినా వైరస్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్వింటల్ రూ.30వేలు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. మిరప పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. నాయకులు ఈరన్న, నరసప్ప పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని.. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివ రామకృష్ణ, నరసప్ప డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, జాతీయ, రాష్ట్ర పండుగలకు సెలవుగా ప్రకటించాలని లేదా వేతన దినాలుగా ప్రకటించాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన, గాయపడ్డ కార్మికులకు రూ.10 లక్షలు, రూ.5లక్షలు మంజూరు చేయాలని, సీనియారిటీ ప్రతిపాదికన జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్ధన్, రాజేంద్రకుమార్, హంసరాజు, యూసుఫ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.